www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

# కఠినం.. సుదీర్ఘం!

- మ్యాథ్స్‌, ఫిజిక్స్‌ కష్టం.. కెమిస్ట్రీ సులభం!
- సుదీర్ఘ ప్రశ్నలతో కంప్యూటర్‌ స్ర్కీన్‌పై తిప్పలు
- ఎంసెట్‌పై విద్యార్థుల మనోగతం



కోడ్‌ విడుదల చేస్తున్న మంత్రి గంటా



విజయవాడలో ఎంసెట్‌ పరీక్షకు బారులు తీరిన విద్యార్థులు

అమరావతి/జేఎన్‌టీయూ(కాకినాడ), ఏప్రిల్‌ 22(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అన్ని జిల్లాలతో పాటు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఆదివారం ఎంసెట్‌ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆన్‌లైన్‌ విధానంలో ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 94% మంది విద్యార్థులు హాజరయ్యారు. 22 నుంచి 24 వరకు ఆరు సెషన్‌లలో ఇంజనీరింగ్‌ ప్రవేశ పరీక్ష, 25న రెండు సెషన్‌లలో అగ్రికల్చర్‌, మెడికల్‌ పరీక్షను నిర్వహించనున్నారు. కాగా, ఎంసెట్‌ తొలిరోజు పరీక్షలో మ్యాథ్స్‌, ఫిజిక్స్‌ ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. ఈ రెండు సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు కష్టంగా ఉండటంతో పాటు సుదీర్ఘంగా ఉన్నాయని, దీంతో వాటిని చదవడానికే ఎక్కువ సమయం పట్టిందని తెలిపారు. అయితే, కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగానే ఉన్నాయన్నారు. పరీక్ష కంప్యూటర్‌ ద్వారా జరగడంతో ఇంగ్లిష్‌, తెలుగులో ఉన్న ప్రశ్నలు, సమాధానాలు ఒకేసారి స్ర్కీన్‌పై చూడడం వీలుకాలేదని, దీంతో పదే పదే స్ర్కీన్‌ను జరుపుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. దీంతో సమయం వృధా అయ్యిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, కాకినాడ జేఎన్‌టీయూలోని సెనేట్‌ హాల్లో ఇంజనీరింగ్‌ పరీక్షకు సంబంధించిన రెండు సెషన్ల కోడ్‌లను మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదివారం ఉదయం విడుదల చేశారు. 'ఒక నిమిషం ఆలస్యం' నిబంధనను సడలించాలని, సరైన కారణాలను చూపిస్తే ఒకటి, రెండు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు అనుమతించాలని మంత్రి సూచించారు. ప్రవేశ పరీక్షల ప్రాథమిక 'కీ'ని ఈ నెల 25న ఏపీ ఎంసెట్‌ వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని, మే 3న ఫలితాలు విడుదల చేస్తామన్నారు. ఎంసెట్‌కు సంబంధించిన సందేహాల నివృత్తికి 0884 2340535, 2356255 నంబర్ల ద్వారా కానీ apeamcet18@gmail.com మెయిల్‌ ద్వారా కానీ సంప్రదించాలన్నారు.